సమావేశము – VI
నెం. 1

వెల : రూ. 25–00
30 ఆగష్టు, 2025
శనివారము

తెలంగాణ శాసన సభ కార్యకలాపాలు

అధికార నివేదిక

విషయ సూచిక

పేజీ. నెం.

I. సంతాప ప్రతిపాదనః

ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్‌రెడ్డి ఇలా ప్రతిపాదిస్తారు.. 01
"తెలంగాణ శాసన సభ సభ్యులు **శ్రీ మాగంటి గోపీనాథ్** గారి మృతి పట్ల ఈ సభ తన తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది".

తెలంగాణ శాసన సభ

ప్రధాన అధికారులు

సభాపతి	:	శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్
కార్యదర్శి	:	డా. వి. నరసింహా చార్యులు
అదనపు కార్యదర్శి	:	శ్రీ సిహెచ్. ఉపేందర్ రెడ్డి
సంయుక్త కార్యదర్శి	:	శ్రీమతి వి.ఎన్. ప్రసన్నకుమారి
ఉప కార్యదర్శులు	:	శ్రీమతి ఎస్. నాగమణి శ్రీ ఎమ్. రఘుమారెడ్డి శ్రీ ఎ. సుధాకర్ శ్రీ పి. శ్రీనివాస్ శ్రీమతి ఎ. పద్మాసిని
సహాయ కార్యదర్శులు	:	శ్రీమతి ఎస్.వి.వి. సత్యశ్రీ శ్రీ ఎన్. సుజిత్ కుమార్ శ్రీ కె. భాస్కర శ్రీనివాస్ శ్రీ సి.కె. వినోద్‌కుమార్ శ్రీమతి బి. ప్రమీల శ్రీ ఆర్. రమణయ్య శ్రీ సిహెచ్. నాగరాజు శ్రీ పి. వెంకటేశం శ్రీ మహమ్మద్ హమీదుద్దీన్ శ్రీ పి.వి. సునీల్
చీఫ్ రిపోర్టర్	:	శ్రీ జి. రాజేశ్వరరెడ్డి

తెలంగాణ శాసన సభ కార్యకలాపాలు

అధికార నివేదిక

(ఆరవ సమావేశం - మొదటి రోజు)

శనివారము, ఆగష్టు 30, 2025

(సభ ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైనది)

(గౌరవ సభాపతి అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

10.30 & 10.40 ఉ. **MR. SPEAKER:-** I request the Hon'ble Chief Minister to move the Condolence Motion.

శ్రీ ఎ. రేవంత్ రెడ్డి (గౌరవ ముఖ్యమంత్రి):- అధ్యక్షా, తమరి అనుమతితో ఈ సంతాప తీర్మానాన్ని ప్రతిపాదిస్తున్నాను.

"తెలంగాణ శాసన సభ సభ్యులు శ్రీ మాగంటి గోపీనాథ్ గారి మృతి పట్ల ఈ సభ తన తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది."

అధ్యక్షా, మనందరికీ, దాదాపు ఈ సభలో ఉన్న చాలామంది సభ్యులకు ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో నివసించిన వారికి, చదువుకున్న వారికి చిన్న వయసు నుండే మాగంటి గోపీనాథ్ గారు మిత్రులు. 1963, జూన్ 2వ తేదీన జన్మించిన మాగంటి గోపీనాథ్ గారు విద్యార్థి రాజకీయాలలో చురుకుగా ఉండడమే కాకుండా వారు 1983లో మొట్టమొదటిసారి ఎన్.టి. రామారావుగారు ప్రారంభించిన తెలుగుదేశం పార్టీలో క్రియాశీలక సభ్యుడిగా చేరి, ఆ పార్టీ తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడిగా వారు దాదాపుగా 7 సంవత్సరాలు సేవలందించడం జరిగింది. 1985 నుండి 1992 వరకు తెలుగు యువత అధ్యక్షుడిగా ఎన్.టి. రామారావుగారి యొక్క పరమ భక్తుడిగా, వారికి నమ్మకమైన, విశ్వాసపాత్రుడైన ఒక బంటుగా ఎన్.టి. రామారావుగారితో వారికి సత్సంబంధాలుండేవి. అదేవిధంగా వారు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ డైరెక్టర్‌గా, హైదరాబాద్ వినియోగదారుల ఫోరం సభ్యునిగా వివిధ బాధ్యతలను వారు నెరవేరుస్తూ వచ్చారు.

అదేవిధంగా వారు సినిమా రంగంలో ఒక నిర్మాతగా, ఒక విద్యార్థి రాజకీయ నాయకునిగా, ఒక ప్రజాప్రతినిధిగా తెలుగుదేశం పార్టీలో ఎదిగి, సీనియర్ నిర్మాతగా కూడా వారు రాణించడం జరిగింది. 1995లో పాతబస్తీ సినిమా, అదేవిధంగా 2000 సంవత్సరంలో నటశేఖర కృష్ణగారిని హీరోగా పెట్టి వారు రవన్న పేరుతో ఒక గొప్ప చిత్రాన్ని నిర్మించడం, భద్రాద్రి రాముడు సినిమా 2004లో, నా స్టైలే వేరు సినిమా 2009లో.. ఇలాంటి తెలుగు సినిమాల నిర్మాతగా కూడా వారు రాణించడం జరిగింది.

అదే విధంగా వారికి, నాకు అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. నాకు ఒక మంచి మిత్రుడు మాగంటి గోపీనాథ్ గారు. 2014వ సంవత్సరంలో నేను రెండవసారి శాసన సభ్యునిగా మాగంటి గోపీనాథ్ గారు మొట్టమొదటి శాసన సభ్యునిగా ఈ సభలో మొట్టమొదటి తెలంగాణ రాష్ట్ర శాసన సభలో కలిసి పని చేయడం జరిగింది. ఎన్నికల

సమయంలో గానీ, ఎన్నికైన తరువాత గానీ, వారు తరువాత రాజకీయ విధానాలలో మార్పు వచ్చినా వ్యక్తిగతమైన మిత్రుత్వం, అదే విధంగా వారి యొక్క వ్యవహార శైలిలో ఎలాంటి మార్పు లేదు. ఒక మిత్రునిగా 2014, 2018, 2023.. మూడుసార్లు శాసనసభ్యునిగా ఎన్నికై హ్యాట్రిక్ సాధించిన శాసన సభ్యులలో చాలా తక్కువ మందిలో మాగంటి గోపీనాథ్ గారు ఒకరు. ఈరోజు అనుకోని పరిస్థితుల్లో వారు అకాల మరణం చెందడం ఈ సభలో ఉన్న సభ్యులకే కాదు, వారి కుటుంబానికి, జంట నగరాలలో పేదలకు వారు లేని లోటు ఈరోజు మనందరం చూస్తున్నాము. జూన్ 8న వారు మరణించడం జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలకు తీరని లోటు. అదే విధంగా వారి కుటుంబానికి, వారి సోదరుడు, వారి తల్లి, వారి భార్య, కూతురు, కుమారుడు వారి కుటుంబ సభ్యులకు ఒక తీరని లోటు. ఎందుకంటే వారి అకాల మరణం ఆ కుటుంబానికి తీరని దుఃఖాన్ని తీసుకొచ్చి పెట్టింది.

జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలకు కూడా చాలా లోటు. ఎందుకంటే సౌమ్యుడు, మితభాషి మాగంటి గోపీనాథ్ గారు. వారు చాలా తక్కువగా మాట్లాడుతారు. చూడడానికి చాలా క్లాస్ లీడర్‌గా కనిపించినా మాగంటి గోపీనాథ్ గారు ఒక మాస్ లీడర్. జూబ్లీహిల్స్ ప్రాంతంలో ఉండే ఆ నియోజకవర్గంలో ఉండే బస్తీ పేదలతో వారికున్న సన్నిహిత సంబంధాల వల్ల రాజకీయాల పరిస్థితులు, ఆటుపోట్లు ఉన్నా మూడుసార్లు శాసనసభ్యునిగా ఎన్నికై ఆ ప్రాంత ప్రజలకు వారు సేవలందించడం జరిగింది. ఈరోజు ఈ సభ, మనందరం వారి కుటుంబానికి అండగా నిలబడాలి. వారి ఆత్మకు శాంతి చేకూరాలి. అలాంటి అరుదైన ప్రజాసేవలో ఉన్న ప్రజా ప్రతినిధులను కోల్పోవడం మనందరికీ తీరని లోటు. అందుకే తమరి అనుమతితో ఈ శాసనసభలో ఈ సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టడమే కాకుండా ఆ కుటుంబానికి ప్రగాఢమైన సానుభూతిని తెలియజేస్తూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, తమరి దగ్గర సెలవు తీసుకుంటున్నాను.

MR. SPEAKER:- I request the Hon'ble L.A. Minister to speak.

శ్రీ డి. శ్రీధర్ బాబు (గౌరవ శాసనవ్యవహారాల శాఖామంత్రి):- అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప ప్రతిపాదనను బలపరుస్తూ, ఈరోజు మనందరికీ కూడా సుపరిచితులు ప్రత్యేకంగా నాకు చాలా దగ్గరి వ్యక్తిగా, ఒక అన్నగా మాగంటి గోపీనాథ్ గారి అకాల మరణం చాలా దిగ్భ్రాంతిని కలిగించింది. వారు జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించి మనందరి సహచర ఎమ్మెల్యేగా ఈరోజు మన మధ్యలో లేకపోవడం కూడా చాలా బాధాకరం. మనందరి హృదయాలను కూడా ఈ సందర్భం ద్రవింపచేస్తుంది. మాగంటి గోపీనాథ్ గారిని నేను చాలా వ్యక్తిగతంగా, దగ్గరగా చూసిన వ్యక్తిని. వారు ఆరోజు తెలుగు యువత అధ్యక్షునిగా ఉన్న సందర్భంలో వారి చిన్న తమ్ముడు మాగంటి రాజ్‌కుమార్ నాకు చాలా దగ్గర మిత్రుడిగా, ఒక అన్నగా ఎల్లప్పుడు కలిసి ఉండేవారము. ఆనాడు అనుకోని పరిస్థితుల్లో గోపీనాథ్ గారి తమ్ముడిని కోల్పోయిన నేపథ్యంలో చాలా సంవత్సరాలు ఆ కుటుంబం కోలుకోలేకపోయింది. అమ్మగారు, ఇద్దరు అన్నలు ఆ కుటుంబం అంతా కూడా చాలా బాధాతప్త హృదయంతో అనేక సంవత్సరాలు గడిచిపోయినప్పటికీ చాలా సంవత్సరాలు రాజకీయంలో ఉండి తెలుగు యువత అధ్యక్షునిగా అనేక సంవత్సరాలు పని చేసారు.

ఇప్పుడు ఇక్కడ పెద్దలు అందరూ ఉన్నారు. శ్రీనివాస్ యాదవ్‌గారు గానీ వారి సహచరుడిగా అనేక సంవత్సరాలుగా ప్రతి సందర్భంలో కూడా టిక్కెట్ గురించి ప్రయత్నం చేసేవారు. కానీ రాజకీయం అంటే అందరికీ తెలుసు ఎప్పుడు ఎవరికీ ఏవిధంగా అవకాశం వస్తుందో మన చేతిలో లేదు. చాలా సంవత్సరాల తరువాత వారికి అవకాశం వచ్చినప్పుడు జూబ్లీహిల్స్‌కి సంబంధించి శాసన సభ్యుడిగా నిలబడడానికి అవకాశం వచ్చింది. వారు మాతో సంప్రదించినప్పుడు నేను వారికి ఒకటే చెప్పాను. కష్టంగా ఉన్నా నిష్ఠూరంగా ఉన్నా అవకాశం వచ్చినప్పుడు తప్పకుండా నిలబడి మీరు ముందుకు

నడవాలంటే ఆ సందర్భాన్ని పురస్కరించుకొని వారు ప్రజాప్రతినిధిగా వారి రాజకీయ జీవితాన్ని అరంగేట్రం చేయడం జరిగింది. వారు ఒక ప్రజాప్రతినిధి మాత్రమే కాకుండా ప్రజల మనసులో నిలిచిపోయే విధంగా సేవ చేస్తూ, ఒక మానవతా వాదిగా నిలిచిన వ్యక్తి. ఒక మృదు స్వభావి ఆయన వ్యక్తిత్వంలో ప్రతి సందర్భంలో నిజాయితీ, అందరితో కలిసిమెలిసి ఉండే గుణం ప్రధానంగా కనిపించేవి.

జూబ్లీహిల్స్ అంటే మొత్తం రాష్ట్రంలోనే ఒక ముఖ్యమైన నియోజకవర్గమని చెప్పవచ్చు. ఆ ప్రాంతంలో సేవలు చేస్తూ, ఇంకా ఏదో చేయాలనే తలంపుతో ముందుకు నడిచిన వ్యక్తి చెప్పవచ్చు. అభివృద్ధి పనులలో, పేద ప్రజలకు సంబంధించి వారికి అండగా నిలబడడానికి అనునిత్యం వారి సమస్యలను పరిష్కారం చేయడానికి స్వర్గీయులైన గోపీనాథ్‌గారు కృషి చేయడం జరిగింది. సభలో వారు లేని లోటును స్పష్టంగా చూస్తున్నాము. జూన్ 2, 1963 హైదరాబాద్‌లో హైదర్‌గూడలో కృష్ణమూర్తి మరియు మహానంద కుమారి దంపతులకు జన్మించిన గోపీనాథ్‌గారు 4 దశాబ్దాల పైచిలుకు ప్రజాసేవలో, పార్టీలలో చురుకుగా పనిచేసి పాల్గొన్నారు. 1983లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి బీ.ఏ కోర్సులో పట్టభద్రులై, మూడుసార్లు జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు గోపీనాథ్‌గారు.

1983లో తెలుగుదేశం పార్టీని స్థాపించిన సందర్భంలో వారు ఒక యువకుడిగా వారు రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి 1985 నుండి 1992 వరకు తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేస్తూ, 1987-88లో హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో కూడా డైరెక్టర్‌గా వారి పాలనా పరంగా తొలి అనుభవాన్ని మొదలుపెట్టారు. 1988-93 వరకు వినియోగదారుల ఫోరం అధ్యక్షునిగా టిడిపి హైదారాబాద్ జిల్లా అధ్యక్షునిగా వారు బాధ్యతలు నిర్వహించారు. 2014లో జూబ్లీహిల్స్‌లో వారికి అవకాశం రావడం మూడుమార్లు గెలవడం.. మనందరం కూడా Cutting across parties అధ్యక్షా, గోపీనాథ్‌గారి గురించి అందరూ కూడా వారి యొక్క సహచరులు సమాజంలో ఒక నిజమైన ప్రజానాయకుడిని కోల్పోయిన అంశాన్ని సభ దృష్టికి తీసుకొస్తూ, ఈరోజు గోపీనాథ్‌గారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు, జూబ్లీహిల్స్ ప్రజలకు సభ పక్షాన కూడా మా హృదయపూర్వక సానుభూతిని తెలిజేస్తున్నాను. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన చూపిన మార్గం, ఆయన నడిచిన మార్గం మంచి పనులు చేసిన మార్గం మనందరికీ కూడా ప్రేరణగా నిలవాలని మనసారా కోరుకుంటూ, వారి కుటుంబ సభ్యులందరికీ కూడా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

MR. SPEAKER:- I request K.T. Rama Rao garu to speak.

10.50 ఉ. **శ్రీ కె. తారక రామారావు**:- అధ్యక్షా, ఈ సభలో సోదరుడు మా సహచరుడు హైదరాబాద్ నగర శాసనసభ్యుడు మాగంటి గోపీనాథ్ గారికి సంతాపం తెలియజేయాల్సి వస్తుందని మేము కలలో కూడా అనుకోలేదు. ఎందుకంటే వారు జీవించి ఉన్నంతకాలం కూడా ఎన్నడూ తమకు అనారోగ్యం వచ్చిందని, అదికూడా ఇంత తీవ్రంగా సమస్య ఉందని వారు ఎప్పుడూ ఎవరితో పంచుకోలేదు. వారు ఆరకంగా గుమ్మనంగా వారి వ్యక్తిగత సమస్యలు గాని, వారి అనారోగ్య సమస్యలు గానీ చాలా రహస్యంగా, ఒక రకంగా చెప్పాలంటే చాలా ప్రైవేట్‌గా ఉంచారు. కానీ పబ్లిక్‌పరంగా మాత్రం ఇంతకుముందు ముఖ్యమంత్రి గారు, శాసనసభ వ్యవహారాల మంత్రి గారు చెప్పినట్లు హైదరాబాద్ నగరంలో జూబ్లీహి ల్స్ అంటేనే చాలా సంపన్నులు నివసించే ప్రాంతంగా పేరొందింది. కాని జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిస్థితి చూస్తే మాత్రం పూర్తిగా దానికి భిన్నంగా ఉంటుంది. పేరుకు జూబ్లీహిల్స్ నియోజకవర్గమైనప్పటికి అక్కడ ఉండేది మాత్రం పేద ప్రజలు . పేరుకు జూబ్లీహిల్స్ నియోజకవర్గమైనా కానీ అక్కడ ఉండేది బోరబండ, రహమత్ నగర్, షేక్‌పేట, ఎర్రగడ్డ, వెంగళ్‌రావు నగర్.. ఈ రకంగా మొత్తానికి మొత్తంగా బస్తీలు, స్లమ్స్‌తో కూడిన ప్రాంతం.

హైదరాబాద్‌లోని హైదర్‌గూడలో 1963వ సంవత్సరంలో గోపీనాథ్ గారు జన్మించారు. వారు ఉస్మానియా యూనివర్సిటీలో చదువుకొని, ఎన్.టి. రామారావు గారి వీరాభిమానిగా తెలుగుదేశం పార్టీ స్థాపించిన తరువాత వారు రాజకీయాలల్లోకి అడుగుపెట్టడం జరిగింది. నాకు బాగా గుర్తు ఉంది. నా చిన్నప్పుడు ఎమ్మెల్యేలకు బషీర్‌బాగ్‌లో ఇచ్చిన క్వార్టర్స్‌లోనే మా కుటుంబమంతా నివాసం ఉండేది. పెద్దలు కేసీఆర్ గారు ఆనాడు శాసనసభ్యులుగా ఉన్నప్పుడు మొట్టమొదటిసారి 1985వ సంవత్సరంలో న్యూఎమ్మెల్యే క్వార్టర్స్‌లో నివాసం ఉండేవారు. నేను కూడా అక్కడే ఉండేవాడిని. అక్కడ నుంచి బయటకు వస్తే ప్రస్తుతం ఉన్న సెక్రటేరియట్ ముందు ఎక్కడైతే అమరజ్యోతి ఉన్నదో అక్కడ మాకు ఎప్పుడూ ఒక కటౌట్ కనపడేది. బహుశా హైదరాబాద్‌లో చూసింది అదే మొట్టమొదటి కటౌట్ అయి ఉండవచ్చు. పూజ్యులు ఎన్.టి.రామారావుగారి నిలువెత్తు కటౌట్‌ను కృష్ణుడి రూపంలో, రాముడి రూపంలో వారి కటౌట్ పెట్టి, కిందమాగంటి గోపీనాథ్ గారి పేరుని రాసి ఉండేది. హైదరాబాద్‌లో కటౌట్స్ కల్చర్ కానీ.. ఒక రకంగా చెప్పాలంటే ఆనాడు తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఈ రకంగా అక్కడే పర్మనెంట్‌గా ఒక కటౌట్ తనకంటూ ఏర్పాటు చేసుకున్న నాయకుడు మాగంటి గోపీనాథ్‌గారు. వారు రాజకీయాలలో చాలా క్రియాశీలకంగా ఉండేవారు. వారు మొదటి నుంచి చాలా క్రియాశీలంగా విద్యార్థి దశ నుంచి రాజకీయాలలో ఉన్నారు. తెలుగు యువతలో పని చేశారు. ఒక పార్టీ ఒక నాయకున్ని నమ్ముకుంటే చివరి దాక..... వారు ఒకసారి ఎన్.టి.ఆర్.గారి నాయకత్వంలో నడిచారు, ఆ తర్వాత తెలుగుదేశం పార్టీ మన రాష్ట్రంలో మాయం అయిన తర్వాత వారు కేసీఆర్‌గారితో కలిసి కష్టం వచ్చినా, నష్టం వచ్చినా రెండుసార్లు కేసీఆర్‌గారి నాయకత్వంలో ఎమ్మెల్యేగా గెలిచారు. మొదటిసారి ఎన్.టి. రామారావుగారి తెలుగుదేశం పార్టీలో 2014లో గెలిచి ఆ తర్వాత బి.ఆర్.ఎస్.పార్టీ నుంచి కూడా రెండుసార్లు ఎమ్మెల్యే అయ్యారు. ముఖ్యమంత్రిగారు చెప్పినట్లు హ్యాట్రిక్ కొట్టడం ఎమ్మెల్యేలకు అంత సులువు కాదు. గోపీనాథ్‌గారి గురించి ఒక మాట చెప్పాలంటే వారు చనిపోయిన నాడు నేను, హరీష్‌రావుగారు ఇద్దరం ఏఐజి హాస్పిటల్ నుండి బయలుదేరి వారి ఇంటికి వెళ్లి కొన్ని ఏర్పాట్లు చేద్దామని ముందు వెళ్లాము. ఆరోజు నిజంగా మాకు ఆశ్చర్యం అనిపించింది. మన హైదరాబాద్‌లో ఊపర్ షేర్వాణీ, అందర్ పరేషానీ అని ఒక సామెత చెబుతారు. అక్కడికి వెళ్లిన తర్వాత అక్కడి పరిస్థితి చూసి నేను, హరీష్‌రావుగారు ఆశ్చర్యపోయాము. గోపీనాథ్‌గారు ఉండే ఏరియాలో ఆయనది చాలా చిన్న ఇల్లు. అంటే సుమారు 250 నుంచి 300గజాలు కూడా ఉంటుందో ఉండదో కానీ, ఎన్నడు కూడా గోపీనాథ్‌గారు మాకు .. ఇందాక ప్రభుత్వం నుంచి చెప్పినట్లు తనకు ఏమైనా ఇబ్బంది ఉన్నా చెప్పేవాడు కాదు. మేము ఆయన నివాసానికి వెళ్లి చూసిన తర్వాత.. వారికి అక్షర నాగ, దిశిర, వాత్సల్యనాథ్ అని ముగ్గురు పిల్లలు ఉన్నారు. వారు చాలా చిన్న పిల్లలు అంటే సుమారు ఇరవై, ఇరవై ఒక్క ఏండ్లు ఉంటాయి. వారికి ఇంకా వివాహాలు కాలేదు, వాళ్లు ఇంకా సెటిల్ కాలేదు. వాళ్లను చూసి మేము బాధపడ్డాము. ఆ తర్వాత ఆయన ఇల్లు చూసి గోపీనాథ్ గారు ఇన్ని రోజులు ఇక్కడ ఎలా ఉన్నారని కూడా బాధపడ్డాము. ఎందుకంటే ఎప్పుడు ఏ ఫంక్షన్ వచ్చినా బాగా ల్యావిష్‌గా ఖర్చు పెట్టేవారు. ఊపర్ షేర్వాణీ, అందర్ పరేషానీ అని ఎందుకు అన్నానంటే, ఎక్కడ కూడా అతనికి ఈ కష్టం ఉందని కానీ ఇంకొకటని కానీ ఎవరికీ తెలియనీయలేదు.

ఆనాడు తెలంగాణ ప్రభుత్వం బతుకమ్మ చీరలు అనే కార్యక్రమాన్ని 2016-17లో ప్రారంభించాము. కానీ అంతకంటే ముందే తన నియోజకవర్గంలో బతుకమ్మకు చీరను పెట్టే సంస్కృతిని తీసుకొచ్చింది కూడా గోపీనాథ్‌గారే. మనమందరం గోపీనాథ్ అని ఇక్కడ పిలుస్తాము కానీ నియోజకర్గంలో ఆయనను గోపన్న గానే పిలుచుకుంటారు. ఎక్కడికి వెళ్లినా ఏ డివిజన్‌కి వెళ్లినా గోపన్న అనే మాట్లాడుతారు. ప్రజలలో నిత్యం మమేకమయ్యే వ్యక్తి. ఒక చిన్న ఉదాహరణ నేను చెబుతాను. రెహమత్‌నగర్ డివిజన్‌లో ఎస్.పి.ఆర్. హిల్స్ అని ఉంటుంది. అక్కడ ఒక అయిదెకరాల స్థలం ఉండేది,

ఒకక్వారీ ఉండేది. ఆ క్వారీ మొత్తం త్రవ్వడం అయిపోయింది. అక్కడ చుట్టూ బస్తీలు ఉన్నాయి. వాటిని కబ్జా పెట్టడానికి కొంత మంది ప్రయత్నం చేశారు. గోపీనాథ్‌గారు పట్టుబట్టి ఆనాడు ప్రభుత్వంలో ఉన్న మా అందరిని అక్కడికి తీసుకెళ్లి ఆ ప్రదేశాన్ని చూపించి అక్కడ పిల్లలు ఆడుకునే విధంగా ఒక గ్రౌండ్, అదేవిధంగా కమ్యూనిటీ అంతా గ్యాదర్ అయి కార్యక్రమాలు చేసుకునే విధంగా ఏర్పాటు చేయాలని పట్టుబట్టి దానిని ఒక గ్రౌండ్‌గా తీర్చిదిద్ది, అక్కడ బతుకమ్మ వేడుకలు కానీ అలాగే రంజాన్ సందర్భంలో అక్కడ కార్యక్రమాలు చేయడం, క్రిస్టమస్‌కి క్రిస్టమస్ వేడుకలు చేయడం వంటివన్నీ చాలా జాగ్రత్తగా నిర్వహించేవారు.

దాంతోబాటు వారు బ్రతికినంత కాలం ఒక మాస్ లీడర్‌గా ప్రజల మధ్యనే ఉండి ఎప్పటికప్పుడు డైనమిక్‌గా తిరుగుతూ ఎవరికైనా ఏ అర్ధరాత్రి సమస్య వచ్చినా అపరాత్రి సమస్య వచ్చినా అధికారులను వెంటనే సంప్రదించి పనులు చేసిపెట్టేటటువంటి మంచి మనసున్న నాయకుడు. గోపీనాథ్ గారు నగర పార్టీ అధ్యక్షుడుగా ఉండడమే కాకుండా కేసీఆర్ గారికి నమ్మిన విధేయుడుగా ఉంటూ ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా తట్టుకుని నిలబడి కేసీఆర్ గారికి నమ్మిన విధేయుడిగా మా పార్టీలో రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత వారు అదే పద్ధతుల్లో కొనసాగారు. వారి మరణం మా పార్టీకి, వారి సతీమణి శ్రీమతి సునీత గారికి, వారి పిల్లలకు, వారి తల్లి గారికి, వారి బ్రదర్‌కి, మిగతా కుటుంబ సభ్యులందరికీ తీరని లోటు. వీరితోబాటు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో తనదైన చిరస్మరణీయమైన ముద్రను గోపీనాథ్ గారు వేసుకున్నారు కాబట్టి తప్పకుండా ఆ నియోజకవర్గానికి వారి మరణం తీరని లోటు. ఈ దుఃఖ సమయంలో వారి కుటుంబానికి మా పార్టీ పూర్తి స్థాయిలో అండగా ఉంటుంది. మా పార్టీ తరపున గతంలో ఎలాగైతే మా సహచరులు మరణించినప్పుడు ఆ కుటుంబాలకు అండగా నిలబడి ఎలాగైతే ఆ కుటుంబాలను కాపాడుకున్నామో అదే రకంగా మాగంటి గోపీనాథ్ గారి కుటుంబాన్ని కూడా పూర్తి స్థాయిలో గోపన్న లేకపోయినా వారి కుటుంబాన్ని సంపూర్ణంగా ఆదుకునే బాధ్యతను మా పార్టీ తీసుకుంటుంది. ఈరోజు శాసనసభలో వారి సంతాప తీర్మానంపై మాట్లాడే పరిస్థితి రావడంపై బాధను వ్యక్తం చేస్తూ, ఈ శోకాప్త సమయంలో వారి కుటుంబానికి అదే విధంగా వారి అభిమానులకు, కార్యకర్తలకు కూడా మనోధైర్యాన్ని కల్పించాలని ఆ భగవంతుడిని కోరుకుంటూ తమరికి ధన్యవాదాలు తెలియజేస్తూ ముగిస్తున్నాను.

MR. SPEAKER:- I request the Minister for Agriculture, Sri Tummala Nageswara Rao garu to speak.

శ్రీ తుమ్మల నాగేశ్వరరావు (గౌరవ వ్యవసాయ శాఖామాత్యులు):- అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రి గారు చెప్పినట్లుగా ఈ సంతాప తీర్మానం సభలో పెట్టే పరిస్థితి రావడమనేది దురదృష్టకరం. మనలో ఒకడిగా మరీ ముఖ్యంగా నాతో 1983 నుంచి వివిధ రాజకీయాలలో హైదరాబాదు నగరంలో చెప్పుకోదగ్గ వ్యక్తిగా పూజ్యులు ఎన్.టి. రామారావు గారి దగ్గర నుంచి నేటి వరకు ఒక ప్రత్యేక ముద్రను హైదరాబాదు నగరానికి అందించినటువంటి మిత్రుడు గోపీనాథ్ గారి అకాల మరణం మనందరినీ బాధిస్తున్నది. అతను సిట్టింగ్ మెంబర్‌గా ఉండి మరణించడం అత్యంత బాధాకరమైనది. అయినప్పటికీ కాలం మన చేతిలో లేదు, వారు ఎమ్మెల్యేగా ఉన్న జూబ్లీహిల్స్ నియోజకవర్గం బాధ్యతలు ముఖ్యమంత్రి గారి మీద అదే విధంగా మా ప్రభుత్వం మీద ఉన్నది కాబట్టి తప్పకుండా జూబ్లీహిల్స్ ప్రజలు మీలో ఉన్నటువంటి ఒక నాయకుడిని కోల్పోయి ఆ నియోజకవర్గ ప్రజలు బాధాతప్త హృదయంతో ఉన్నారు, గోపీనాథ్ గారు ఆశించినటువంటి జూబ్లీహిల్స్‌ను సంపూర్ణంగా అభివృద్ధి చేసే బాధ్యతను మా ప్రభుత్వపరంగా మేం తీసుకోవడంతోబాటు వారి కుటుంబానికి సానుభూతిని తెలియజేస్తూ, వారి సంతాప తీర్మానాన్ని సమర్థిస్తూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

MR. SPEAKER:- I request the Minister for BC Welfare, Sri Ponnam Prabharkar garu to speak.

శ్రీ పొన్నం ప్రభాకర్ (గౌరవ రవాణా మరియు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖామాత్యులు):- అధ్యక్షా, మాగంటి గోపీనాథ్ గారి మృతిపట్ల సంతాపం తెలియజేస్తూ, పెద్దలు ప్రవేశపెట్టిన తీర్మానం ప్రకారం వారి కుటుంబ సభ్యులందరికీ సానుభూతి తెలియజేస్తున్నాను. మేము 1999 సంవత్సరంలో NSUI రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నప్పుడు హిమాయత్‌నగర్, హైదర్‌గూడ ప్రాంతంలో ఎప్పుడూ మాగంటి గోపీనాథ్ గారి బ్యానర్ కనపడుతుండేది. ఆ విధంగా రాజకీయాలలో ఉంటూ నేను NSUI రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నప్పుడు పరస్పరంగా ఆర్గనైజేషన్‌లు డిఫరెంట్ అయినప్పటికీ కాంపిటీటివ్ స్పిరిట్‌లో వారితో వివిధ కార్యక్రమాలలో వివిధ సందర్భాలలో కలిసి చర్చించే అవకాశం నాకు కలిగింది. 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత నేను హైదరాబాద్ ఇంఛార్జ్ మంత్రిగా ఉన్నందున జూబ్లీహిల్స్ శాసనసభ్యుడిగా వారిని నేను అనేక సందర్భాలలో కలిసి వివిధ కార్యక్రమాల గురించి చర్చించే అవకాశం వచ్చింది. అటువంటి సందర్భంలో వారు అనారోగ్యానికి గురై అకాల మరణం చెందడం పట్ల సంతాపాన్ని తెలియజేస్తూ, వారి కుటుంబ సభ్యులందరికీ ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, జూబ్లీహిల్స్‌కు సంబంధించి ఇందాక పెద్దలు చెప్పినట్లుగా తప్పకుండా నేనొక హైదరాబాదు ఇంఛార్జ్ మంత్రిగా ఆ నియోజకవర్గానికి సంబంధించిన ప్రజల సమస్యల గురించి ఇప్పటికే మేం వారు లేని లోటు కొంత తీర్చాము. భవిష్యత్తులో కూడా ఇంకా బాధ్యతగా జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించడానికి నేనొక ఇంఛార్జ్ మంత్రిగా ప్రభుత్వం పక్షాన అన్ని విధాలుగా తోడు ఉంటానని తెలియజేస్తూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి సానుభూతిని, సంతాపాన్ని తెలియజేస్తున్నాను.

11.00 ఉ.

MR. SPEAKER:- I request Sri Talasani Srinivas Yadav garu to speak.

శ్రీ తలసాని శ్రీనివాస్ యాదవ్:- అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తున్నాను. అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రి గారు, మంత్రులు, మా నాయకుడు కేటీఆర్ గారు గోపీనాథ్ గారి గురించి ఇక్కడ మాట్లాడటం జరిగింది. కానీ, గోపీనాథ్ గారితో నాకున్నటువంటి అనుబంధం వేరు. మేము యువకులుగా ఉన్నప్పుడు ఎన్.టి. రామారావు గారు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం చేయడం జరిగింది. అప్పుడు ఎన్.టి. రామారావు గారు అబిడ్స్‌లో ఉండేవారు, పార్టీ కార్యాలయం మాత్రం హిమాయత్‌నగర్‌లో ఉండేది. గోపీనాథ్ గారి ఇల్లు దాని ఎదురుగా హైదర్ నగర్‌లో ఉండేది. తెలుగు యువతలో ఎన్.టి. రామారావు గారితోపాటు, వారు ఎక్కడికి పోతే అక్కడికి నేను, గోపీనాథ్ గారు కలిసి హైదరాబాద్‌లోనే కాకుండా ఢిల్లీలో, ఆంధ్రప్రదేశ్‌లో, తమిళనాడులో అనేక కార్యక్రమాలు చేయడం జరిగింది. ఎన్.టి. రామారావు గారు అంటే మాకు బాగా అభిమానం. మేము చిన్నప్పటినుంచే వారితోపాటు తెలుగు యువత కార్యక్రమాల్లో కలిసి పనిచేయడం జరిగింది.

అప్పుడు గోపీనాథ్ గారు తెలుగు యువత నగర అధ్యక్షుడిగా, ఆ తదనంతరం తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చినాక డైరెక్టరుగా, వినియోగదారుల సంఘం మెంబర్‌గా పని చేయడం జరిగింది. అనుకోకుండా 1994లో నాకే

అవకాశం వచ్చింది. ఇప్పుడున్న అంబర్‌పేట్, ఖైరతాబాద్ మధ్యలో హిమాయత్ నగర్ ఉండేది. అప్పుడు అక్కడున్నటువంటి పరిస్థితులు అనుకూలంగా లేకపోవడం మూలాన తనకు అవకాశం రాలేదు. నాకు సికింద్రాబాద్‌లో అవకాశం రావడం జరిగింది. తదుపరి నేను, గోపీ కూర్చొని మాట్లాడుకోవడం జరిగింది. ఏదేమైనా దేవుడున్నాడు, భవిష్యత్తు ఉంది, పార్టీ ఉంది, మన అన్నగారు ఉన్నారు కదా అని మాట్లాడుకోవడం జరిగింది. ఆ తరువాత వారు జూబ్లీహిల్స్‌కి షిఫ్టు కావడం జరిగింది. తరువాత ఎన్.టి. రామారావు గారు మరణించిన తరువాత చంద్రబాబు గారి నాయకత్వంలో మేము పని చేయడం జరిగింది. డీలిమిటేషన్ అయిన తరువాత జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఏర్పడటం జరిగింది. జూబ్లీహిల్స్ నియోజకవర్గం కింద తనకి అవకాశం ఇవ్వాలని చంద్రబాబు గారితో మాట్లాడటం జరిగింది. నేను అప్పటికే మూడుసార్లు శాసనసభ్యుడిగా ఉన్నాను. 2014లో నాది సనత్‌నగర్ నియోజకవర్గం. మా రెండు నియోజకవర్గాల బార్డర్లు కలిసి ఉంటాయి. నేను సికింద్రాబాద్ నుండి సనత్‌నగర్‌కి మారాను, గోపీ జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుండి ఉన్నారు. నేను నా నియోజకవర్గం కంటే ఎక్కువగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోనే ప్రచారం చేయడం జరిగింది. ఎందుకంటే, నాకు ఎప్పుడో పది, ఇరవై ఏండ్ల కింద అవకాశం వచ్చింది. మేము ఇద్దరం తోటి యువకులం. కానీ, గోపీకి మొదటిసారి అవకాశం వచ్చిందని, ఎట్టి పరిస్థితుల్లో గోపి గెలవాలనే సంకల్పంతో బోరబండ, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, ఎర్రగడ్డ, షేక్‌పేట్, వెంగళ్‌రావు నగర్, జూబ్లీహిల్స్‌లో ఉన్నటువంటి స్లమ్స్ అంతా కూడా ప్రచారం చేయడం జరిగింది. వారు మొదటిసారి ఎమ్మెల్యే అయిన తరువాత ఒక్క ప్రభుత్వ కార్యక్రమాల్లోనే కాకుండా తన స్వంత కార్యక్రమాలను కూడా డిజైన్ చేసుకొని నిరంతరంగా ప్రజలకు అందుబాటులో ఉండేవారు. ఏవైనా పండుగలు వచ్చినప్పుడు స్వంతంగా కార్యక్రమాలు చేసేటువంటి వ్యక్తిత్వం వారిది.

ఆ తరువాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రెండు రాష్ట్రాలుగా విడిపోయింది. గౌరవ ముఖ్యమంత్రి గారు రేవంత్ రెడ్డి గారు, నేను, గోపీనాథ్ గారు అప్పుడు అందరం కలిసి పని చేయడం జరిగింది. రెండు రాష్ట్రాలుగా విడిపోయిన సందర్భంలో, రెండు రాష్ట్రాలు అయ్యాయి కదా, మన రాష్ట్రాన్ని మనందరం కలిసి పనిచేసి మన రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామని పెద్దలు కేసీఆర్ గారు మాతో మాట్లాడినప్పుడు మేమందరం టిఆర్ఎస్ పార్టీలో చేరడం జరిగింది. ఏ చిన్న కార్యక్రమం అయినా, మాట్లాడుకొని పని చేస్తుండే వారిమి. కానీ, దురదృష్టం కొద్ది తన ఆరోగ్యం... ఇంత తీవ్రంగా ఉంటుందని, తనని ఇంత చిన్న వయసులోనే మనం కోల్పోతమనేది కలలో కూడా ఊహించలేదు.

వారు చనిపోయే ముందు 25వ తేదీన మా తమ్ముడి డిన్నర్ ఉంటే వారు మా ఇంటికి రావడం జరిగింది. అక్కడ మేము ఒక గంటసేపు మాట్లాడుకున్న సందర్భంలో తాను వారి విషయాలు నాతో షేర్ చేసుకున్న తరువాత నేను వారికి చెప్పడం జరిగింది. డిన్నర్ అయిన తరువాత రేపు నేను ఆస్ట్రేలియా వెళ్తున్నాను, వచ్చిన తరువాత కూర్చొని మాట్లాడుకొని ఇబ్బందులు లేకుండా చూసుకుందామని చెప్పడం జరిగింది. కానీ, అనుకోకుండా వారు మరణించడం, నిజంగా అధ్యక్షా. జననం, మరణం అనేది సర్వసాధారణం అయినప్పటికీ పేదలు, ప్రజలు ప్రేమించేటువంటి ఒక గొప్ప నాయకుడిని కోల్పోవడం అనేది చాలా బాధాకరమైనటువంటి అంశం.

మన శాసనసభలోనే 2014 నుండి కంటిన్యూగా మూడుసార్లు గెలుపొందడం జరిగింది. ఒక వ్యక్తి కంటిన్యూగా మూడుసార్లు గెలుపొందడం అనేది చిన్న విషయం కాదు. కరెంట్ రాజకీయాలన్నీ టెంపరరీ రాజకీయాలుగా అయిపోయాయి. కానీ, రియాలిటీ అనేది వేరే ఉంటుంది. హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో కంటిన్యూగా

గెలవడమనేది మామూలు విషయం కాదు. వారు ఆ నియోజకవర్గ ప్రజలకు ఒక గోపన్నగా, నిరంతరం ప్రజల్లో ఉండేవారు. పెద్దలు శ్రీధర్‌బాబు గారు ఇంతకుముందే చెప్పారు. గోపి తమ్ముడు రాజ్‌కుమార్ చనిపోయినప్పుడు ఆ కుటుంబమంతా చాలా డిస్టబ్ అయింది. వారి తల్లి గారు గానీ, వారి అన్న గారు గానీ, గోపీ కానివ్వండీ చాలా డిస్టబ్ అయ్యారు. నేను ఎప్పుడు అక్కడనే ఉండేవాడిని. మూడుసార్లు గెలుపొంది శాసనసభ్యుడిగా ఉంటూ మరణించడం అనేది చాలా బాధాకరమైనటువంటి అంశం.

గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ, ఆ కుటుంబానికి భగవంతుడు ధైర్యాన్ని ఇవ్వాలని కోరుతున్నాను. వారు ఆసుపత్రిలో ఉన్నప్పుడే మిగిలిన కార్యక్రమాలు జరిగే వరకు పెద్దలు కేటీఆర్ గారు, హరీష్ రావు గారు, పార్టీ అన్నివిధాలుగా అండదండలుగా ఉంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజల గోపన్న, మా గోపన్న, మనందరి గోపన్నను ఎలాగైతే కోల్పోయామో, వారు చిరస్థాయిగా జూబ్లీహిల్స్ ప్రజల గుండెల్లో ఉండేవిధంగా మేము కార్యక్రమాలు తీసుకుంటామని ఈ సందర్భంగా తెలియజేస్తూ, నాకు ఇచ్చిన అవకాశానికి ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను.

MR. SPEAKER:- I request Sri Venkata Ramana Reddy garu to speak.

శ్రీ కాటిపల్లి వెంకటరమణారెడ్డి:- అధ్యక్షా, ఈరోజు మాగంటి గోపీనాథ్ గారు ఈ శాసనసభలో లేకపోవడం అనేది నిజంగా దురదృష్టం. మొట్టమొదటిసారిగా ఎన్నికైన నేను ఆయనను కొద్ది రోజులుగానే చూస్తున్నటువంటి వ్యక్తిగా, ఆయన ఎన్.టి. రామారావు గారికి అభిమానిగా ఉన్నప్పుడు ఆయన పెట్టిన కటౌట్స్‌ని కూడా చూడడం జరిగింది. మాగంటి గోపీనాథ్ గారు 1963లో జన్మించి, వెంకటేశ్వర ట్యుటోరియల్స్‌లో చదువుకొని, ఉస్మానియాలో పట్టాపొందిన తరువాత తెలుగుదేశం పార్టీలో ఎన్.టి. రామారావు గారితో పని చేయడానికి ముందుకు వస్తూ, విద్యార్థిగా అక్కడే తెలుగుదేశం యువజన విభాగానికి అధ్యక్షుడిగా ఉంటూ, హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో ఆయన సభ్యుడిగా కొనసాగుతూ, అలాగే 2014 వరకు రాజకీయాల్లో సుదీర్ఘంగా ఉంటూ 2014లో మొట్టమొదటిసారిగా ఈ శాసనసభకు ఎన్నికై 2018లో తిరిగి మరొక్కసారి, 2023లో మూడవసారి హ్యాట్రిక్ చేస్తూ శాసనసభకు మూడుసార్లు గెలిచిన వ్యక్తిగా నిలిచారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఎనలేని సేవలు చేస్తున్నటువంటి మాగంటి గోపీనాథ్ గారు సినీ నిర్మాతగా, సినీ రంగంలో కూడా అగ్ర నటులతో సినిమాలు తీసి చిరస్థాయిగా ఎన్.టి. రామారావు గారి అభిమాని ఎవరంటే మాగంటి గోపీనాథ్ గారనే పేరు సంపాదించడం జరిగింది. అటువంటి పరిస్థితుల్లో ఆయన రాజకీయాల్లో కూడా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలుచుండిపోయి ఆనాడు ఎన్.టి. రామారావు గారితో రాజకీయ అరంగేట్రం చేసి ఇప్పుడున్న కేసీఆర్ గారితో పదేళ్లు ఈ శాసనసభలో సభ్యుడిగా ఉంటూ, ప్రస్తుత శాసనసభలో కూడా సభ్యుడిగా ఉన్నటువంటి మాగంటి గోపీనాథ్ గారు ఈరోజు లేకపోవడం దురదృష్టకరం.

11.10 ఉ. అలాగే ఆయన సతీమణి శ్రీమతి సునీత గారికి, వారి ముగ్గురు పిల్లలకి మా భారతీయ జనతా పార్టీ తరుపున, నా తరపున ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, రాబోయే కాలంలో వారి కుటుంబానికి అందరూ అండదండలుగా ఉంటూ, సరియైనటువంటి ఆ వ్యక్తికి చిరస్థాయిగా నిలిచిపోయేలా పరిస్థితులను ఉంచాలని కోరుకుంటూ, వారి ఆత్మకు శాంతి కలగాలని ఆ దేవుని ప్రార్థిస్తూ, ముగిస్తున్నాను.

جناب احمد بن عبداللہ بلعلہ (JANAB AHMED BIN ABDULLAH BALALA): شکریہ اسپیکر صاحب! آج سی ایم صاحب نے جو تحریک تعزیت پیش کی ہے، اس پر بات کرنے کے لئے میں یہاں کھڑا ہوا ہوں۔ ایم۔ گوپی ناتھ صاحب جو اسمبلی کے گزشتہ سیشن میں ہمارے ساتھ تھے، آج ہمارے درمیان نہیں ہیں۔ انسان کا پیدا ہونا ثبوت ہے موت کے لئے۔ ہر پیدا ہونے والے کو مرنا ضروری ہے اور موت اس کو آنی ہے، لیکن یاد وہی لوگ رہیں گے جو اچھے کام کر کے دنیا سے گئے۔ جس نے اچھے کام کئے، لوگ اس کو یاد کریں گے کہ وہ ایک اچھا آدمی تھا۔ جو خراب کام کرے گا، لوگ اس کے بارے میں بولیں گے کہ وہ ایک برا آدمی تھا، اچھا ہوا کہ وہ مر گیا۔ بہر حال وہ ایک بہترین، شریف النفس اور خاموش طبیعت کے انسان تھے جو 2014ء سے مسلسل تین بار جیت کر ہمارے ساتھ اس اسمبلی میں آئے۔ وہ عوام کے درمیان رہتے تھے اور عوام کے کام کرتے تھے۔ انہوں نے تلگو دیشم پارٹی سے شروعات کی۔ 2014ء میں جب ریاست کا bifurcation ہوا اور جس وقت الیکشن ہوا، انہوں نے پہلی بار 2014ء میں کامیابی حاصل کی۔ میرے ساتھ بھی ان کے بہت اچھے مراسم تھے۔ میں ہمیشہ ان سے پوچھتا رہتا تھا کہ گوپی! آپ کی طبیعت کیسی ہے؟ وہ کہتے تھے کہ بلعلہ بھائی! ٹھیک ہے۔ وہ بڑی اچھی طبیعت کے انسان تھے اور عوام کے درمیان رہنے والے شخص تھے۔ تو بہر حال میں میری اور میری پارٹی کی جانب سے ان کے تمام افرادِ خاندان کو تعزیت پیش کرتا ہوں۔ یہ ایک مثال ہے کہ اس ہاؤز میں ہم جتنے بھی ممبرس ہیں، irrespective of political parties, ہم کو اوپر والے نے عوام کی خدمت کرنے کے لئے چن کر اس ہاؤز میں بھیجا ہے۔ آج ایم۔ گوپی ناتھ صاحب ہمارے درمیان اس ایوان میں نہیں ہیں۔ اسی طرح ایسے کئی بڑے بڑے لیڈرس آج ہمارے درمیان نہیں ہیں۔ لوگوں کے لئے اچھے کام کر کے دنیا سے جانا ہماری ذمہ داری ہے۔ آج وہ نہیں رہے، کل ہماری باری ہے، کل کون نہیں رہے گا، ہم نہیں بتا سکتے، لیکن جتنی بھی زندگی ملی، اس میں ہم عوام کے لئے اچھے کام کر کے دنیا سے جائیں تا کہ لوگ ہم کو یاد رکھیں۔ میں ایک بار پھر اس ہاؤز کے ذریعہ ان کے تمام افرادِ خاندان کو تعزیت پیش کرتا ہوں۔ اسپیکر صاحب! میں آپ کا شکریہ ادا کرتا ہوں کہ آپ نے مجھے بولنے کے لئے وقت دیا۔ شکریہ۔

శ్రీ కూనంనేని సాంబశివరావు:- థ్యాంక్యూ సార్. మన సహచర శాసనసభ్యులు, జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్నటువంటి మాగంటి గోపీనాథ్ గారిని కోల్పోవడం చాలా విషాదకరం, దురదృష్టకరం.

మన పెద్దలు చెప్పినట్లుగా పుట్టిన తరువాత మరణించడమనేది సహజమేగానీ, అకాల మరణమనేది బాధాకరం. గోపీనాథ్ గారితో నాకు వ్యక్తిగతంగా సంబంధాలు లేనప్పటికీ, ఆయనకి ఆర్గనైజేషన్ స్కిల్స్ బాగా ఉండేవని వారి గురించి జూబ్లీహిల్స్‌లో మా బంధువులు గానీ, మాకు తెలిసిన వాళ్ళు గానీ ఎక్కువగా చెప్తూ ఉండేవారు. ఎన్టీఆర్ గారి కాలంలోనే రామారావు గారిని పదవీచ్యుతుని చేసినప్పుడు కొన్ని వేలమందితో ఆనాడే మోటారు సైకిళ్ళతో ర్యాలీ నిర్వహించారని, వారు యువకునిగా ఉన్నప్పుడే గొప్పగా ఆర్గనైజేషన్ కెపాసిటీ ఉన్నటువంటి వ్యక్తిగా వారిగురించి చెప్తుంటారు.

అలాగే, వారు మూడుసార్లు శాసనసభ్యునిగా ఎంపికవ్వడమనేది, అది పార్టీ బలాలో, లేకపోతే ఆ పార్టీ నాయకుని బలాలో అయినప్పటికీ కూడా, ఒక శాసనసభ్యునిగా అవకాశం పొందడమనేది, ఆయనకి వ్యక్తిగతంగా ఉన్నటువంటి సామర్థ్యాన్ని బట్టే ఉంటుంది. అది ఎన్టీరామారావు గారు గానీ, లేకపోతే కేసీఆర్ గారు గానీ, ఎవరైనాసరే. ఆ సామర్థ్యం కూడా ఉండాలి. అటువంటి సామర్థ్యం కలిగినటువంటి వ్యక్తి. తరువాత, ఆ మధ్యలో ఈ సభలోనే మేము ఒకటి రెండుసార్లు కలుసుకున్నాం. చాలా సున్నితంగా, చాలా సౌమ్యంగా, మర్యాదగా, పెద్దలు అంటే గౌరవంగా.., ఆ విధమైన స్వభావం కలిగినటువంటి వ్యక్తిగా ఆయన్ను చూశాం.

ఏది ఏమైనా, గోపీనాథ్‌గారి మరణం అందరికీ విచారకరం. ముఖ్యంగా వారి కుటుంబ సభ్యులకు మరింత బాధాకరం. వారి మరణం పట్ల వ్యక్తిగతంగా నా తరపున, మా సీపీఐ పార్టి తరపున సంతాపం తెలియజేస్తూ, వారి కుటుంబసభ్యులందరికీ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, మీకు ధన్యవాదాలు తెలియజేస్తూ, నమస్కారం అధ్యక్షా.

మిస్టర్ స్పీకర్:- సంతాప ప్రతిపాదన. హైదరాబాదు జిల్లా....

(ఆ సమయంలో ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీకి చెందిన సభ్యులు.. తమ సభ్యులలో మరికొంత మందికి మాట్లాడేందుకు సమయమివ్వాలని, దివంగత సభ్యుడు తమ పార్టీకి చెందినవారు కావున తప్పక తమ పార్టీ సభ్యులకు మాట్లాడే అవకాశమివ్వాలని గౌరవ సభాపతిని కోరారు.)

కె.పి. వివేకానంద గారూ, మీరొక్కరు మాట్లాడండి.

శ్రీ కె.పి. వివేకానంద్:- అధ్యక్షా, మాకు దగ్గరి మిత్రుడు కాబట్టి, తప్పకుండా మా ఫీలింగ్స్ తెలవాలి కాబట్టే, మిమ్మల్ని అవకాశం కోరాం. ఇచ్చినందుకు ధన్యవాదాలు.

అధ్యక్షా, మాగంటి గోపీనాథ్ గారు చాలా డిసిప్లిన్ కలిగిన నాయకుడు. చాలా సిస్టమ్యాటిక్‌గా, వెల్ డిసిప్లెన్డ్‌గా, వెల్ బిహేవ్డ్‌గా, ఒక ఆదర్శవంతంగా ఉన్న నాయకుడు. ఆయన ఫుల్‌టైమ్ పొలిటీషియన్ అధ్యక్షా. వారి చిన్న వయస్సు నుంచి వారికి అవకాశం లభించినా, అంటే, వారు రాజకీయంగా యాక్టివ్‌గా ఉన్నప్పటికీ వారికి పోటీ చేసే అవకాశం

లభించునప్పటికీ రెండు మూడు దశాబ్దాల పాటు వారు వెయిట్ చేశారు. 2014లో వారికి అవకాశమొచ్చింది అధ్యక్షా. దానినిబట్టే మనం చెప్పుకోవచ్చు, వారికి ప్రజాసేవ చేయాలనే ఉద్దేశ్యంపైన ఎంత నిబద్ధత ఉందో. అంటే, వారిని కమిటెడ్‌గా ఉన్న ఫుల్‌టైమ్ పొలిటీషియన్‌లా మనం చూస్తున్నాం. ఫుల్‌టైమ్ పొలిటీషియన్లు అరుదైనటువంటి ఈ తరుణంలో, 1983 నుండి 2014లో వారికి అవకాశమొచ్చే వరకు కూడా వారు ఎంతో ఓపికతో ఉన్నారంటే, వారికి ఈ రాజకీయాల పట్ల, ఈ రాజకీయాల ద్వారా ప్రజలకు సేవ చేయాలనే వారి ఉద్దేశ్యాన్ని మనం స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు.

అధ్యక్షా, మేమందరమూ కూడా 2014లో మొదటిసారిగా ఈ శాసనసభకు ఎన్నికైనాము. వారు వ్యక్తిగతంగా నన్ను చాలా ప్రోత్సహించేవారు. మాట్లాడడానికి గానీ, అసెంబ్లీలో సమస్యలపై డిస్కస్ చేయడానికి గానీ, హైదరాబాదు విషయాలని ప్రస్తావించేటప్పుడు గానీ, ఏమైనా అవకాశమొస్తే వివేక్‌కి అవకాశమియ్యండి, తప్పకుండా మాట్లాడతారు, బాగా మాట్లాడతారని వారు నన్ను వ్యక్తిగతంగా ప్రోత్సహించిన సందర్భముంది. అటువంటి వారు ఇప్పుడు లేకపోవడమనేది చాలా బాధాకరమైన విషయం.

అధ్యక్షా, వారు వయస్సులో నాకంటే చాలా పెద్దవారు. వారు నాకంటే 14 సంవత్సరాలు పెద్దవారైనా గానీ, నన్నొక ఫ్రెండ్‌లాగా, వారి దగ్గరి మిత్రుడిగా ట్రీట్ చేసేవారు. వారి వయస్సు నాకు తెలవను కూడా తెలవదు. వారిని అన్నా, అన్నా అంటూ పిలవడం జరిగేది. మిత్రుత్వానికి చాలా విలువలిచ్చేటువంటి వ్యక్తి మాగంటి గోపీనాథ్ గారు అధ్యక్షా.

అధ్యక్షా, గత పది సంవత్సరాలలో పురపాలక మంత్రిగా ఉన్నటువంటి కేటీఆర్‌గారి నాయకత్వంలో మేమందరం కూడా ఒక హైదరాబాదు టీమ్‌గా పనిచేశాం. నగర ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడంలో కానివ్వండి, హైదరాబాదులో వరదలు వచ్చినప్పుడు ఏరకంగా దీనిని పరిష్కరించాలన్నప్పుడు కానివ్వండి, మేము వ్యక్తిగతంగా మాట్లాడుకున్నప్పుడు కూడా, అప్పుడు స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ ప్రోగ్రాం గానీ, స్ట్రాటజిక్ రోడ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం గానీ, ఇలా అనేక సమస్యలు పరిష్కరించడంలో మేమందరం ఒక జట్టుగా, హైదరాబాదులో ఉన్నటువంటి శాసనసభ్యులందరం కూడా ఒక టీమ్‌గా పని చేశాం. అలా పనిచేసిన మూలానే మేమందరం కూడా మూడుసార్లు గెలవగలిగాము, ప్రజల మనస్సుల్లో స్థానం సంపాదించుకోగలిగాం.

అధ్యక్షా, మాగంటి గోపీనాథ్ గారు మమ్మల్ని ప్రత్యేకంగా ప్రోత్సహించి ముందుకు నడిపించినటువంటి నాయకుడు. అదేవిధంగా హైదరాబాదు నగర అభివృద్ధిలో తప్పకుండా తనదైన పాత్ర పోషించాడనడంలో ఎలాంటి సందేహం లేదు అధ్యక్షా. వ్యక్తిగతంగా కూడా వారి స్వంత ఖర్చులతో..., చాలా ఆశ్చర్యమేసేది అధ్యక్షా, మెంబర్‌షిప్ ప్రోగ్రామ్ కానివ్వండి, బూత్‌కమిటీలు వేసినప్పుడు కానివ్వండి, రెండుమూడు రోజుల్లోనే కమిటీలను పూర్తి చేసేవారు. మేము ఏరకంగా చేస్తున్నావు గోపన్నా అంటూ వారి దగ్గర నుండి నేర్చుకున్నాం. వారు వెల్ డిసిప్లిన్డ్. అంతా కూడా సిస్టమ్యాటిక్‌గా..., ఇప్పుడు కూడా, వారు పరమపదించిన తరువాత కూడా, మేము పోయి వారి నియోజకవర్గంలో మాట్లాడితే, ఎక్కడికక్కడ వారి కమిటీ మెంటర్స్...., టు ది పాయింట్ ఉన్నాయి. అంటే, ఏ రకమైనటువంటి ఫోకస్డ్‌గా, నిబద్ధతతో వారుండేవారనేది దానినిబట్టి మనం అర్థం చేసుకోవచ్చు. తనను నమ్ముకున్న వాళ్ళకి, తన కార్యకర్తలకి, తన అభిమానులకి తమ స్వంతఖర్చుతో కూడా వారిని ఆదుకుని వారిని ముందుకు నడిపించినటువంటి నాయకుడు.

అధ్యక్షా, గ్రామీణ ప్రాంతాలలో లాగా 2 లక్షల ఓటర్లు ఉంటే, వారికి ప్రాతినిధ్యం వహించడం వేరు. కానీ, ఇక్కడ నియోజకవర్గాల్లో 4 లక్షలు, 5 లక్షలు ఓటర్లుంటారు. మరి వారందరినీ కూడా ఒక్క తాటిపై నడిపించడమనేది చాలా కత్తిమీద సాము లాంటిది. అలాంటిది, వారు జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి శాసనసభ్యుడిగా మూడుసార్లు గెలవడమే కాకుండా, ప్రజల మనస్సుల్లో స్థానం సంపాదించుకున్న నాయకుడు, మాగంటి గోపీనాథ్‌గారు మా

మధ్యన లేరంటే చాలా అంటే చాలా బాధనిపిస్తోంది. వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని, వారియొక్క కుటుంబానికి కూడా ధైర్యాన్నివ్వాలని ఆ భగవంతుడిని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తూ, ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తూ, సెలవు తీసుకుంటున్నాను. థ్యాంక్యూ.

11.20 ఉ. **శ్రీ వేముల ప్రశాంత్‌రెడ్డి**:- అధ్యక్షా, ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తున్నాను. మాగంటి గోపీగారు మన మధ్యన లేకపోవడం చాలా బాధాకరం. వారూ నేను 2014లో ఒకేసారి ఈ సభలోకి వచ్చాము. 2014, 2018, 2023 వరుసగా మూడు పర్యాయాలు ఈ సభలో వారితో కలిసి పని చేసినాం. వారు చాలా మృదుస్వభావి. Non-controversial person. ఎక్కడా కూడా వివాదాలకు తావివ్వకపోయేది. వారితో నాకు దాదాపు 30-35 సంవత్సరాల క్రితం నుండే పరిచయం ఉండేది. మా తండ్రి, మా కుటుంబం తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకళ్లం. ఆ రోజు నుండి కూడా మాగంటి గోపీగారితో మాకు పరిచయం ఉండేది. He was a party man. ఆయన ఏ పార్టీలో ఉన్నా ఆ పార్టీకి, పార్టీ నాయకునికి నమ్మకంగా పని చేసిన వ్యక్తి. ఆరోజు ఎన్.టి.ఆర్.గారి టీడీపీకి, టీఆర్ఎస్‌లోకి వచ్చిన తరువాత కేసీఆర్‌గారికి నమ్మకస్తునిగా పని చేశాడు. ఒక రాజకీయ నాయకునికి అటు పార్టీకి నమ్మకంగా పని చేయడం, నిబద్ధతతో పని చేయడం అలాగే రెండవ వైపు ప్రజలతో మంచి సంబంధాలు ఏర్పరచుకొని ప్రజలతో బాగుండడం, ఈ రెండు లక్షణాలు చాలా తక్కువ మందిలో simultaneousగా ఉంటాయి. ఈ రెండు లక్షణాలున్న అరుదైన వ్యక్తులలో మాగంటి గోపీగారొకరని చెప్పి నేను భావిస్తున్నాను. పార్టీకి ఆయన కమిట్‌మెంట్ చూసినట్లయితే ఆరోజు టీడీపీలో ఎన్.టి.రామారావుగారు అధికారంలో ఉన్నప్పుడే కాదు, అధికారంలో లేనప్పుడు కూడా చాలా తక్కువ మంది ఎన్.టి.రామారావుగారితో అంటిపెట్టుకుని ఉన్నారు, అటువంటి వ్యక్తుల్లో ఆయనొకరు.

ఆరోజుల్లో మేము చూసేది.. ఎన్.టి.రామారావుగారు అధికారం కోల్పోయిన తరువాత.. కొన్ని రోజులు నాచారం స్టూడియోలో ఉండేది.. హైదరాబాదుకు చాలా దూరంగా ఉండేది. అక్కడికి చాలా తక్కువ మంది వెళ్ళేది. కానీ, మాగంటి గోపీనాథ్‌గారు ప్రతిరోజు వారు, వారితోబాటు కొంతమంది అనుయాయులతోటి అక్కడుండేది. వారితోబాటు ఆరోజుల్లో సాయిబాబా, స్పోర్ట్స్ రామ్మోహన్ ఇలా కొద్దిమందితో, మేము కూడా చాలా ఎక్కువ సందర్భాలల్లో అక్కడ ఉండేది. అట్లా ఆ రోజుల్లో కలిసి ఉన్న వ్యక్తులం, ఆరోజుల్లో ఆలోచనలు పంచుకున్న వ్యక్తులం. తరువాత టీఆర్ఎస్ అధికారం కోల్పోయిన తరువాత కూడా అదే నిబద్ధతతోటి టీఆర్ఎస్ పార్టీకి కావచ్చు, కేసీఆర్‌గారికి కావచ్చు అదే నిబద్ధతతో పని చేసిన వ్యక్తి. అదే విధంగా జూబ్లీహిల్స్ ప్రజలతో కూడా... ఇంతకు ముందు కేటీఆర్‌గారు, శ్రీనివాస్ యాదవ్‌గారన్నారు... మూడుసార్లు కంటిన్యూగా గెలవడం అంటే, అదీ జూబ్లీహిల్స్ నియోజకవర్గం, హైదరాబాద్‌లో గెలవడం అంటే అంత ఈజీ కాదు. ప్రజలతో ఆయన పెనవేసుకున్నటువంటి సంబంధాలు, ప్రజలకు ఆయన చేసినటువంటి సేవ, ఇవన్నీ కూడా ఆయనను ప్రజానాయకునిగా నిలదొక్కుకునేలా చేశాయి. ఆయన చిరస్మరణీయుడు, ఆయన పేరు ఎప్పటికీ ఉంటుంది. ఆయన కుటుంబానికి మా పార్టీ అండగా ఉంటుంది. ఆయన నియోజకవర్గ ప్రజలకి, ఆయన కార్యకర్తలందరికీ ఆయన లేని లోటును తీర్చే విధంగా మేము అండగా ఉంటామని మా కేటీఆర్‌గారు చెప్పారు. కాబట్టి, మరొక్కసారి వారి కుటుంబానికి మా ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరుస్తూ, ఆ నియోజకవర్గ ప్రజలకి కూడా నా సానుభూతిని వ్యక్తపరుస్తూ, ఈ అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను అధ్యక్షా.

శ్రీ కాలేరు వెంకటేష్:- గౌరవనీయులు ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తున్నాను. మాగంటి గోపీనాథ్‌గారు 1983 నుంచి క్రియాశీల

రాజకీయాలలో ఉండి, నేనిప్పుడు ప్రాతినిధ్యం వహిస్తున్న అంబర్‌పేట్ నియోజకవర్గం ఒకప్పుడు హిమాయత్‌నగర్‌గా ఉండేది, ఆ నియోజకవర్గం నుండి ఎన్నోసార్లు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించాలని తెలుగు దేశం నుంచి కోరుకున్నప్పటికీ, అతనికి 2014లోనే ఆ అవకాశం రావడం, మూడుసార్లు గెలవడం చాలా గర్వకారణం. నాకు మాగంటి గోపీనాథ్‌గారితోని దాదాపు 20 సంవత్సరాల పరిచయముంది. గోపీగారు తెలుగు దేశంలో చాలా యాక్టీవ్‌గా ఉండి, సిటీ అధ్యక్షునిగా ఉన్నప్పుడు పరిటాల రవి చనిపోయిన రోజు హైదరాబాదులో తెలుగు దేశం కార్యకర్తలు, లీడర్లమీద 30-40 కేసులు రిజిస్టర్ కావడం జరిగింది. ఆ కేసులల్లో అరెస్ట్ అయినప్పుడు అందులో సీనియర్ లీడర్లు కూడా ఉండడం జరిగింది. అప్పుడు నేను తెలుగు దేశం పార్టీకి అడ్వకేట్‌గా పని చేసి, ఆ ముప్పై కేసులను ట్రయల్ చేసి అక్విటల్ చేయడం జరిగింది. ఆ సందర్భం నుంచి మాగంటి గోపీనాథ్ గారూ, నేను బాగా కలవడం జరిగింది. లాస్ట్ టైం నేను ఎమ్మెల్యేగా గెలిచినప్పుడు అతను చేసే కార్యక్రమాలల్లో ఎన్నో నేర్చుకున్నాం.

ప్రభుత్వం ఇచ్చే కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలలో 200 మందికిచ్చినా, 300 మందికిచ్చినా ఆడపడుచులనందరినీ పిలిచి వాళ్ళకు పట్టు చీరలు పెట్టి, భోజనం పెట్టి చాలా అభిమానంగా చూసుకునే వ్యక్తి. అటువంటి విషయాలెన్నో ఆయన దగ్గర నేర్చుకున్నాం. ఈ సందర్భంలో ఇక్కడ స్పీకర్‌గారు, ముఖ్యమంత్రిగారు, క్యాబినెట్ అంతా ఉన్నది, మా ఎమ్మెల్యేలందరి తరఫున నేను ఒకటి విన్నవించుకుంటున్నాను. లాస్ట్ 17,18 నెలల్లోనే మనం ఇద్దరు ప్రజా ప్రతినిధులను కోల్పోయాం. మాకు అన్ని సౌకర్యాలు మీరిస్తున్నారు. గన్‌మెన్‌లను, వెహికల్‌ను, పి.ఎ.ను ఇస్తున్నారు, క్వార్టర్స్ ఇస్తున్నారు, కానీ ఒక పటిష్టమైన హెల్త్ ఇన్సూరెన్స్ లేదు. ఒక ఎమ్మెల్యే ఆసుపత్రికి పోయినప్పుడు ఏ విధంగా హెల్త్ ఇన్సూరెన్స్ వాడుకోవాలి? ఏ ఆసుపత్రికి పోతే ఎమర్జెన్సీ హెల్త్ ఇన్సూరెన్స్ ఉంటుంది? వాటి వివరాలేవీ మా ఎమ్మెల్యేలకు తెలియదు. కాబట్టి, నేను లెజిస్లేటివ్ మినిస్టర్‌గారికి విన్నవించుకుంటున్నాను. ఒక రోజు అందరు ఎమ్మెల్యేలను పిలిచి మనకు ఏయే ఆసుపత్రులలో హెల్త్ ఇన్సూరెన్స్ ఉంటుంది, దానివల్ల ఎటువంటి బెనిఫిట్స్ ఉన్నాయి, అవన్నీ చెబితే బాగుంటుంది. ఎందుకంటే, ఈరోజు మాగంటి గోపీనాథ్ గారు చనిపోవడానికి ముఖ్యమైన కారణం ఆ జబ్బు. అది ఎవరికైనా రావచ్చు. మనం ఇద్దరు ప్రజాప్రతినిధులను కాపాడుకోలేకపోయాము. ఈ సందర్భంగా తమరి ద్వారా విన్నవించుకుంటున్నాం. ఇప్పటికైనా అందరికీ బలమైన ఇన్సూరెన్స్ ఉండాలని నేను కోరుతున్నాను.

మాగంటి గోపీనాథ్‌గారికి, ఆయన కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేసుకుంటున్నాను. ధన్యవాదాలు.

శ్రీ ముఠా గోపాల్:- ఈ అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు. ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తున్నాను. స్వర్గీయ మాగంటి గోపీనాథ్‌గారి గురించి మాట్లాడే అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు అధ్యక్ష. మాగంటి గోపీనాథ్‌గారితో నాకు చాలా మంచి పరిచయం ఉండేది. మేమిద్దరం మొదటి నుండి తెలుగు దేశం పార్టీలో పని చేసినాం. ఎటువంటి చిన్న పని ఉన్నా కలిసికట్టుగా పని చేసే వారం. గోపీనాథ్‌గారికి ఎటువంటి చిన్న పని ఇచ్చినా పెద్దయెత్తున పని చేసే అలవాటు వారికి ఉండేది. హైదరాబాద్ సిటీలో ఏ మూలకి పోయినా పెద్దయెత్తున, ఎవరైనా ఢిల్లీ నుండి లీడర్స్ వచ్చినా పెద్ద పెద్ద బ్యానర్లు కట్టించేవాడు. ఎప్పుడు చూసినా ప్రజల్లో మమేకమై ప్రజా సమస్యల గురించి ఎప్పుడూ కష్టపడి పని చేసే వ్యక్తి గోపీనాథ్‌గారు. ఏ వ్యక్తికి ఎలాంటి అవసరమున్నాగానీ వారి అవసరానికి అనుగుణంగా పని చేసే వ్యక్తి. హైదరాబాద్ సిటీలోని జూబ్లీహిల్స్‌లో మూడుసార్లు ఎమ్మెల్యే అయ్యారంటే మామూలు మాట కాదు.

11.30 ఉ. ఎప్పుడూ ప్రజల మధ్యలో ఉండి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ, ప్రజల కొరకు పనిచేసిన వ్యక్తి మాగంటి గోపీనాథ్ గారు. మాగంటి గోపీనాథ్ గారు కొంచెం నీరసంగా కనిపిస్తున్నప్పుడు ఏంటన్నా నీరసంగా ఉన్నావు అంటే నవ్వుతూ సమాధానం తెలిపేవాడే కానీ అతనిలో ఉన్న బాధలు గానీ, అతను కష్టపడుతున్న తీరు కానీ ఎప్పుడూ బయటపెట్టని వ్యక్తి అతనని తెలియజేస్తున్నాను.

మాగంటి గోపీనాథ్ గారు రాజకీయాల్లోనే కాకుండా సినిమారంగంలో కూడా రాణించిన వ్యక్తి. స్వర్గీయ ఎం.ఎల్.ఏ సాయన్న గారికి మినిస్టరు కావాలని బాగా కోరిక ఉండేది. సాయన్నా నువ్వు మినిస్టరువి కాలేక పోతున్నావు, నిన్ను గ్యారెంటీగా మినిస్టరుని చేసి చూపిస్తా అని అతని నిర్మాణంలో జరిగిన 'నా స్టయిలే వేరు' అనే సినిమాలో ఆయనకు హోం మినిస్టరు పాత్రను ఇచ్చి సాయన్న గారి ఆశను తీర్చిన వ్యక్తి మాగంటి గోపీనాథ్ గారని తెలియజేస్తున్నాను.

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా ఎలాంటి కార్యక్రమాలు చేసినా కానీ హైద్రాబాదు సిటీలో ఆ కార్యక్రమాలకు చాలా పెద్దఎత్తున రెండు మూడొందల మోటారు సైకిళ్లతో ర్యాలీని చేసేవారు. పార్టీపరంగా ఆయనకు ఏ పని చెప్పినా కానీ వెంటనే ఆ పనులను పూర్తి చేసే వ్యక్తి శ్రీ మాగంటి గోపీనాథ్ గారు. అలాంటి మంచి ఆర్గనైజర్, మంచి వ్యక్తి, పేదప్రజానీకం గురించి ఎప్పుడూ పోరాడిన గోపీనాథ్ గారి అకాల మరణం చాలా బాధాకరమని తెలియపరుస్తున్నాను. అతని మరణం మా పార్టీకి తీరని లోటుగా తెలియపరుస్తూ, అతని ఆత్మకు శాంతి చేకూరాలని, అతని కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేస్తున్నాను. నమస్కారం.

సంతాప ప్రతిపాదన

హైద్రాబాద్ జిల్లా, జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గం సభ్యులు శ్రీ మాగంటి గోపీనాథ్ గారి మృతిపట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది.

శ్రీ మాగంటి గోపీనాథ్ గారు 1963, జూన్ 2న శ్రీ కృష్ణమూర్తి, మహానంద కుమారి దంపతులకు జన్మించారు. వీరి విద్యాభ్యాసం అంతా హైద్రాబాద్‌లో సాగింది. వీరు ఉస్మానియా యూనివర్సిటీ నుండి గ్రాడ్యుయేషన్ పట్టా పొందారు. వీరు 1987-1988లో హైద్రాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హుడా) డైరెక్టర్‌గా మరియు 1988 నుండి 1993 వరకు హైద్రాబాద్ జిల్లా వినియోగదారుల ఫోరం అధ్యక్షునిగా పనిచేశారు. వీరు 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ తరఫున జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుండి పోటీ చేసి విజయం సాధించారు. వీరు 2016లో టిఆర్ఎస్ పార్టీలో చేరారు. 2018లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో విజయం సాధించారు. వీరు 2022లో బీఆర్ఎస్ పార్టీ గ్రేటర్ హైద్రాబాద్ అధ్యక్షునిగా పనిచేశారు. 2023వ సంవత్సరంలో జరిగిన శాసనసభ ఎన్నికలలో విజయం సాధించారు.

వీరు మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొంది, జూబ్లీహిల్స్ ప్రజల హృదయాలలో గోపన్నగా చెరగని ముద్ర వేసుకున్నారు. వీరు జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తూ, నిత్యం ప్రజలతో ఉంటూ, ప్రజాసేవే పరమావధిగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి, ప్రజలు మన్ననలను పొందారు.

వీరు శాసనసభలో ప్రజలకు సంబంధించిన అనేక అంశాలపై ప్రస్తావించి అందరి మన్ననలను పొందారు. వీరు 2018లో శాసనసభ అంచనాల సమితిలో సభ్యునిగా పని చేశారు. వీరు 2025, జూన్ 8వ తేదీన పరమపదించారు. వీరి వయస్సు 62 సంవత్సరాలు. శ్రీ మాగంటి గోపీనాథ్ గారి ఆత్మకు శాంతి చేకూరేందుకు గాను, రెండు నిమిషాల పాటు మౌనం పాటిద్దాం.

(సభ రెండు నిమిషాలు మౌనం పాటించింది)

MR. SPEAKER:- Now, the House stands adjourned to meet again at 9 A.M. tomorrow, i.e. on Sunday, the 31st August, 2025.

(The House then adjourned at 11.37 A.M to meet again at 9 A.M on Sunday, the 31st August, 2025)

*****

"Published under Rule 347 of the Rules of Procedure and Conduct of Business in the Telangana Legislative Assembly and Printed at Assembly Press, Public Gardens, Hyderabad."